


## విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదుగాలి

### తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్

మొయినాబాద్, మే17: విద్యార్థులకు నిర్మాణాత్మకమైన విద్యా విధానాన్ని రూపొందించే దిశగా అడుగుల వేయాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఔత్సాహిత, ఆవిష్కరణ అంతర్జాతీయ సదస్సు ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలోని ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, అభివృద్ధి ఒకదానికొకటి అనుసంధానంగా ఉంటాయని, సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసే విధంగా వ్యాపారవేత్తలు సమాజానికి చాలా అవసరం అని చెప్పారు. విద్యార్థులు వ్యాపార వేత్తలను స్ఫూర్తిగా తీసుకుని కొత్త ఆవిష్కరణలకు పునాది వేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఉపాధిని సృష్టించే వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందాలని చెప్పారు. ఈ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ హెజ్ ఓడీ ప్రొఫెసర్ వై.జహంగీర్, బ్రెయిన్‌వేర్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఇంద్రసుతి ఘోషల్, ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ చెన్నప్ప మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటే భవిషత్‌లో కొత్త ఆవిష్కరణలు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

## కూలీలకు పని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

మంచాల, మే 17: ఉపాధి హామీ పథకంలో పనికోసం దరఖాస్తు చేసుకున్న కూలీలకు వెంటనే పని కల్పించాలని ఎంపీడీవో బాలశంకర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు పనికోసం దరఖాస్తు చేసుకున్న 24గంటల్లోపు పనికల్పించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కార్యదర్శులపై చర్యలు తప్పవని చెప్పారు. రాజీవ్ యువ వికాస పథకం, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఉమారాణి, సూపరింటెండెంట్ అబ్దుల్‌అజీమ్, ఈసీ విమలతో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడుతాం



మహాసభకు హాజరైన రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి

తుర్కయాంజాల్, మే 17 : పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. సీపీఐ పార్టీ మహాసభలు శనివారం రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్రాచారి మాట్లాడారు. అనంతరం రాగన్నగూడ, తుర్కయాంజాల్, బ్రహ్మణపల్లి, తొర్రూర్ శాఖలను ఎన్నుకున్నారు. రాగన్నగూడ కార్యదర్శిగా బాలరాజు, సహాయ కార్యదర్శిగా పురుషోత్తం, తుర్కయాంజాల్ కార్యదర్శిగా నరేందర్, సహాయ కార్యదర్శిగా శేఖర్, తొర్రూర్ కార్యదర్శిగా బాలకృష్ణ, బ్రహ్మణపల్లి కార్యదర్శిగా కాటమయ్య, సహాయ కార్యదర్శిగా జగన్, మోహన్‌రెడ్డి, ముత్తయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

## రైతులను విస్మరించి అందాల పోటీలా?

కేశంపేట, మే 17 : రాష్ట్రంలో ప్రభుత్వం రైతులను విస్మరించి అందాల పోటీలకు ఆర్థిక ఖర్చు చేస్తుందని సంతాపూర్ గ్రామ యువ నాయకుడు నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంతాపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. సభలు, సమావేశాల్లో అప్పు పుట్టడంలేదు.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అప్పుల ఊబిలో ఉందని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీలకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా నిధుల జాడలేదని, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రాజీవ్ యువ వికాసం, రూ.500కు గ్యాస్ సిలిండర్ వంటి పథకాలకు సంబంధించి ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అందాల పోటీలకు దుబారా ఖర్చు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే ప్రస్తుత వేసవిలో పంటలు ఎండిపోయాయని, వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం అంటిముట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, తిరుపతి, కృష్ణ, జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యువ నాయకుడు నరేందర్‌రెడ్డి

# నాణ్యమైన విత్తనాలతో దిగుబడులు

**గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి**

**సూచిస్తున్న వ్యవసాయ శాఖ నిపుణులు, వ్యవసాయాధికారులు**



ఇబ్రహీంపట్నం, మే 17 : వానకాలం సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ నిపుణులు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నాసిరకం విత్తనాల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. ప్రభుత్వ గుర్తింపు లేని విత్తనాలను విక్రయిస్తే విత్తన డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు పంటలు సాగుచేసుకుంటున్న రైతన్నలు పొలాల్లో విత్తే విత్తనాలు గుర్తింపు పొందిన కంపెనీలకు చెందినవే వాడాలని వ్యవసాయాధికారులు, వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఫర్టిలైజర్ దుకాణాలను ఆశ్రయించి కల్తీవిత్తనాలు విక్రయించి మోసపోకుండా, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు కోరుతున్నారు. ఎక్కడైనా ఫర్టిలైజర్ దుకాణ యజమానులు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు పరిశీలించి అవి నాణ్యమైనవా, కల్తీయా అని పరిశీలించి కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖాధికారులు తెలుపుతున్నారు.



**విత్తనాల నాణ్యతను పరిశీలించాలి**

- కొనుగోలు చేసేటప్పుడు విత్తనాల నాణ్యతను పరిశీలించాలి.
- విత్తనాలు వందశాతం స్వచ్ఛత కలిగి ఉండాలి.
- 98శాతం బాహ్యస్వచ్ఛతను కలిగి ఉండాలి. హైబ్రీడ్ లేదా అధిక దిగుబడి ఇచ్చే రకాన్ని ఎంచుకోవాలి. విత్తనాల్లో తగినంత తేమశాతం ఉండేలా చూసుకోవాలి.
- విత్తనాల్లో అంతర్గత చీడపీడలు లేని ఆరోగ్యకమరమైనవి మాత్రమే ఎంచుకోవాలి.
- రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లుపై విక్రయదారుడి సంతకంతో పాటు విత్తన వివరాలు ఉండేలా చూసుకోవాలి.
- విత్తనం రకం, ఉత్పత్తి చేసిన సంస్థపేరు, లాట్‌నెంబర్ ఉండేలా బిల్లు తీసుకోవాలి.
- ఏ విత్తనం అయినా కొనుగోలు చేసేటప్పుడు గుర్తింపు పొందిన సంస్థల నుంచి తీసుకోవాలి.

**ఇలాంటి విత్తనాలు కొనుగోలు చేయొద్దు..**

- ఆకుపచ్చ లేబుల్‌లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- గడువు తేదీని పరిశీలించి గడువు దగ్గరగా ఉన్న విత్తనాలు కొనుగోలు చేయాలి.
- సీల్ సరిగ్గాలేని, చిరిగిన లేదా పాడైన సంచులు, డబ్బాలు ఉన్నవి, లైసెన్స్‌లేని, ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు కొనుగోలు చేయరాదు.

**సూచనలు తప్పనిసరిగా పాటించాలి**



విత్తనాలు కొనుగోలు చేసేముందు రైతులు సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలి. అవి మేలు రకమైనవా, నాసిరకమైనవా అనేది చూసుకోవాలి. నాసిరకం విత్తనాలను వ్యాపారులు, రైతులకు విక్రయిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఎక్కడైనా కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా దుకాణాల్లో విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు.

**- వ్యవసాయశాఖ ఏడీఏ సుజాత, ఇబ్రహీంపట్నం**

**నోటిఫైడ్, నాన్‌నోటిఫైడ్ విత్తనాల్లో తేడా..**

విత్తనాల్లో ప్రభుత్వ పరంగా విడుదలయ్యేవి. ప్రైవేటు పరంగా విడుదలయ్యేవి ఉంటాయి. ప్రభుత్వ పరంగా రూపొందించిన రకాలను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నోటిఫైడ్ పేరిట మార్కెట్‌లోకి వస్తాయి. ప్రైవేటు సంస్థలు రూపొందించిన విత్తనాలను నాన్‌నోటిఫైడ్ పేరిట మార్కెట్‌లోకి విడుదల చేస్తాయి. నోటిఫైడ్ విత్తనాల నాణ్యత, 1966నాటి విత్తన చట్టం పరిధిలోకి వస్తాయి. నోటిఫైడ్ విత్తనాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లయితే ఉత్పత్తిదారులు, పంపిణీదారులపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చు.

**విత్తన సంచులపై ఉండే వివరాలు..**

- పరీక్ష చేసిన తేదీ నుంచి 9నెలల కాలపరిమితి కలిగిన విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- ఆకుపచ్చ లేబుల్ తప్పనిసరిగా ఉండాలి.
- ఆకుపచ్చ, నీలం రంగుట్యాగ్ ఉంటే విత్తనం ధ్రువీకృతమైనది.
- ఆకుపచ్చ, తెల్లనిరంగు ట్యాగ్ ఉంటే ధ్రువీకరణ చేసే అధికారి సంతకం చేసి ఉండాలి.
- కనీసం మొలకశాతం, జన్యుస్వచ్ఛత, గరిష్ఠ తేమశాతం ఏ ప్రాంతానికి ఏ కాలానికి అనువైందో చూసుకోవాలి. బీటీ పత్తి విత్తనమైతే కనీస బీటీ ప్రొటీన్‌శాతం, జీఏఈ ఆమోదం పొందిన నంబర్ ఉండాలి.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

కేశంపేట, మే 17 : మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, భైర్ఖాన్‌పల్లి గ్రామాల్లో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆజంఅలీ, ఎంపీవో, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయాంజాల్, మే 17: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తాయని డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘం నుంచి 9 మంది రైతులకు రూ.కోటి 25 లక్షల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సంఘంలో 11 మంది రైతులను సభ్యులుగా చేర్చుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు, సంఘం కార్యదర్శి రాందాస్ పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ సాధించేవరకు పోరాడుతాం



మాట్లాడుతున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి కోర్ కమిటీ సభ్యుడు బ్రహ్మయ్య

యాచారం, మే17: చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేసే వరకు పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి కోర్ కమిటీ సభ్యుడు బ్రహ్మయ్య అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి బీసీలను చైతన్య పరిచేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. చట్ట సభల్లో రిజర్వేషన్ సాధన కోసం రాష్ట్రంలోని అన్ని బీసీ కులాలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిరంతర ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాశీనాథ్, రవి, గణేష్, రమేష్, దశరథ, రఘుపతి, ఈశ్వర్, వెంకటేష్, సతీష్, శివ, భగవత్ చారి, సాయి సునీల్, అనంతయ్య, పాండు, సాయిబాబా తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



షాబాద్ : బడిబాట కార్యక్రమంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోకి చేర్చుకుంటున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్

షాబాద్, మే 17: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని షాబాద్ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఎల్గొండగూడ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన దాత రవీందర్‌రెడ్డి ఏర్పాటు చేయిస్తున్న పాఠశాల ప్రహరీ గేట్‌కు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, యాదయ్య, బలరాం, శ్రీనివాసచారి, మల్లారెడ్డి, సతీశ్, రవి, శేఖర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మంచాల : జాపాలలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మంచాల : ప్రభుత్వ పాఠశాలల్లోనే బడీడు పిల్లలను చేర్పించాలని జాపాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీమ్లానాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని జాపాల గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, డిజిటల్ విద్య, కంప్యూటర్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాంలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయానంద్, వనజ, లింగం పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత



కొత్తగూడెంలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 17 : మండలంలోని బాటసింగారం గ్రామపంచాయతీ కొత్తగూడెంలోని సర్వేనం 10/95, 96ల్లో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కూల్చి వేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేశారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపట్టి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంద్రాణి, సర్వేయర్ జ్యోతి, సిబ్బంది సంజీవ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ భూమిలో బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు, సిబ్బంది



## చెరువును తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాల

మంచాల, మే 17: మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పాఠశాల తరగతి గదులతో పాటు ఆవరణ మొత్తం నీటితో నిండిపోయి చెరువును తలపించేలా దర్శనమిచ్చింది. పాఠశాలలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొందుర్గు, మే 17 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను చౌదరిగూడ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ విజయ్ తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని గాలిగూడ గ్రామంలో అక్రమంగా ఇసుక ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి ఇసుకను తరలిస్తున్నారన్నారు. ట్రాక్టర్‌తోపాటు డ్రైవర్, ఇసుక ఫిల్టర్ నిర్వాహకుడు శ్రీను, వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గర్భిణులకు మెడికల్ కిట్లు



మాడ్గుల, మే17: మండల పరిధిలోని ఆర్కపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌గుప్తా శనివారం గర్భిణులకు మెడికల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలోని సింగల్ విండో డైరెక్టర్ రాజావర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు చంటీ, బ్రహ్మంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు జమీల్, శివలింగం, చెన్నకేశవులు, శంకర్, వంశీ, గణేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

చేవెళ్లటౌన్, మే 17: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. శనివారం చేవెళ్లలో సీపీఐ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలను విస్మరించిందన్నారు. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎండీ మక్బుల్, నాయకులు తదితరులు ఉన్నారు.

## వృథాగా తాగునీరు



యాచారం, మే17: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో తాగునీరు కొన్ని రోజులుగా వృథాగా పోతున్నది. అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు రోడ్డుపై ఏరులైపారుతున్నది. గ్రామంలోని ఒకటవ వార్డులోని మిషన్ భగీరథ పైపు పగిలపోవడంతో లీకేజీ ద్వారా ప్రతి రోజు తాగునీరు వృథాగా పోతుండడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. సమస్యను సత్వరమే పరిష్కరించకుంటే ఆందోళనలు చేయనున్నట్లు కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు.

## ఉజ్వల భవితకు చదువు దోహదం

షాద్‌నగర్‌టౌన్, మే 17: ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్ చదువుతోనే ముడిపడి ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆవరణలో మైక్రోసాఫ్ట్ డేటా ఉచిత శిక్షణ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులను అభినందించి శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్‌కు చదువు ఎంతో ముఖ్యమని, పట్టుదల, క్రమశిక్షణతో చదువుకుంటే తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు, మైక్రోసాఫ్ట్ డేటా శిక్షణ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చి సీఎం పర్యటన చేపట్టాలి



అసంపూర్తిగా నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్

ఆమనగల్లు, మే 17: నేడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే జిల్లాలో పర్యటించాలని బీఆర్ఎస్ పార్టీ ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆమనగల్లు పట్టణంలో భూ వివాదం కారణంగా నిలిచిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, నిధుల లేమితో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును పత్యానాయక్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం పత్యానాయక్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 2.5 కోట్లతో సగం వరకు పనులు కొనసాగి భూ వివాదం కారణంగా నిలిచిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని కేసు వేసిన వారితో మాట్లాడి కళాశాల సమస్య పరిష్కరించాలన్నారు. అదే విధంగా బీఆర్ఎస్ హయాంలో రూ. 4.50కోట్లతో అసంపూర్తిగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డుకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన వరి ధాన్యం తడిసిపోయిందని, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రుణమాఫీ, రైతుబంధు నిధులు వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పంతునాయక్, శ్రీనూనాయక్, సాయిలు, పంతు, మల్యా, యాదయ్య, గణేశ్, జగన్, మల్లేశ్, మహేశ్, శ్రీకాంత్, మణిపాల్, యాదగిరి పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్, మే 17: తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శనివారం లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేలు, మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్ రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు.